క్లుప్తంగా

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యువల్ చేయాలి


ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్‌ను రెన్యువల్ చేయాలని కోరుతూ అఖిల భారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం జిల్లా నాయకుడు రామాంజనేయులు మాట్లాడుతూ ఆర్డీటీ 60 సంవత్సరాలుగా నిరుపేదల అభ్యున్నతి కోసం కృషి చేస్తోందన్నారు. నిరుపేదల కష్టాలను గుర్తించుకుని వెంటనే ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలని వారు కోరారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు


మాట్లాడుతున్న ఏపీసీ శైలజ

శింగనమల: దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా ఉపకరణాలు అందజేస్తామని సర్వ శిక్ష అభియాన్ ఏపీసీ శైలజ అన్నారు. గురువారం శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గంలోని శింగనమల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాల్లోని 52 మంది విద్యార్థులకు ఉచితంగా ఉపకరణాలు అందించడానికి దరఖాస్తులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిత సెంటర్ల ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. వారికి అవసరమైన ట్రై సైకిల్, వీల్ చైర్, సీపీ చైర్, ఐడీ కిట్స్, బ్రెయిలీ కిట్స్, చెవిటి మిషన్ తదితర వాటిని ఉచితంగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు నరసింహరాజు, ప్రవీణ్‌కుమార్, పరమేశ్వర్ రెడ్డి, ఐఈ కో–ఆర్డినేటర్ కవిత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


మాట్లాడుతున్న సీడీపీఓ భారతి

శింగనమల(నార్పల): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సీడీపీఓ భారతి అన్నారు. నార్పలలోని ఉయ్యాలకుంట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు సమతుల ఆహారం తీసుకోవాలని, ఆహారపు అలవాట్లు, సురక్షితమైన నీరు, పరిశుభ్రత పాటించాలని కోరారు. వైద్యాధికారి హెమిమా భూషణ్ మాట్లాడుతూ మహిళలకు వచ్చే క్యాన్సర్ల గురించి దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, శ్రీదేవి, జరీనా భారతి, నాగమణి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

స్కూటీకి నిప్పు


కాలిన స్కూటీ

గుత్తి: పట్టణంలోని కటిక బజారులో నివాసముండే కరీం కు చెందిన స్కూటీకి గుర్తు తెలియని దుండగులు గురువారం తెల్లవారుజామున నిప్పు పెట్టారు. వివరాలు.. కరీం బుధవారం రాత్రి ఇంటి ముందు స్కూటీని పార్క్ చేశాడు. తెల్లవారుజామున స్కూటీ ఉన్న ప్రాంతంలో మంటలు రావడంతో గమనించి మంటలు ఆర్పడానికి ప్రయత్నించాడు. అయితే అప్పటికే పూర్తిగా కాలిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గంగాభవానీ ఆలయ కమిటీ ఏకగ్రీవం

తాడిపత్రిటౌన్: తాడిపత్రి మండలంలోని గంగాదేవిపల్లిలో గురువారం గంగాభవానీ ఆలయ ఆవరణలో ఆలయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ వన్నూర్ స్వామి, ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఆలయ చైర్మన్‌గా రామసుబ్బారెడ్డి, సభ్యులుగా గంగిరెడ్డి, ఆదినారాయణ, కవిత, అనురాధ, కుళ్లాయమ్మ, సాలమ్మ ఎన్నికయ్యారు.

సీఐ బాధ్యతల స్వీకరణ


సీఐ రామారావు

గుత్తి: గుత్తి సీఐగా రామారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పని చేస్తున్న వెంకటేశ్వర్లును పోలీసు ఉన్నతాధికారులు పుట్టపర్తి ఎస్‌బీ సీఐగా బదిలీ చేశారు. పుట్టపర్తి వీఆర్‌లో ఉన్న రామారావును ఇక్కడికి బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన రామారావును ఎస్‌ఐలు సురేష్, నాగప్ప, గౌతమ్, ఏఎస్‌ఐలు నాగమాణిక్యం, రామాంజుల రెడ్డి, పోలీసు సిబ్బంది అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. బదిలీపై వెళుతున్న సీఐ వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

ఏమారితే ప్రమాదమే..


తాడిపత్రి పట్టణంలో ప్రమాదకరంగా మ్యాన్ హోల్


పుట్లూరులో హెచ్చెల్సీ బ్రిడ్జికి పక్క గోడలు కూలిన దృశ్యం

- తాడిపత్రిలో అధ్వానంగా మ్యాన్ హోల్స్
- పుట్లూరులో మరమ్మతులకు నోచుకోని బ్రిడ్జి

తాడిపత్రిటౌన్: పట్టణంలోని అండర్ డ్రైనేజీ మ్యాన్ హోల్స్ మూతలు అధ్వానంగా మారడంతో తరచూ ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. భారీ వాహనాల వల్ల రోడ్డు మధ్యలో ఉన్న మ్యాన్ హోల్ మూతలు ధ్వంసమవుతున్నాయి. అలాగే కొంత మంది ఇళ్ల యజమానులు మ్యాన్‌హోల్‌లోకి ఇంటి నుంచి పైప్‌లైన్ కోసం రోడ్డును తవ్వి వదిలేస్తున్నారు. దీంతో రోడ్డు మధ్యలో మ్యాన్ హోల్ మూతలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ద్విచక్రవాహన దారులు ఏమాత్రం అజాగ్రత్తగా వచ్చినా ధ్వంసమైన మ్యాన్‌హోల్ మూతల కారణంగా ప్రమాదాలకు గురికావాల్సి వస్తోంది. ఇప్పటికే పలువురు ద్విచక్రవాహన దారులు ప్రమాదాలకు గురై ఆసుపత్రి పాలయ్యారు. అధికారులు స్పందించి మ్యాన్‌హోల్ మూతలను సరిచేయాలని పట్టణ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

పుట్లూరు: మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు జెడ్పీ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలకు వెళ్లే ప్రధాన రోడ్డుపై ఉన్న హెచ్చెల్సీ బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. ఈ బ్రిడ్జి పక్కగోడలు కూలిపోవడంతో హెచ్చెల్సీ కాలువలోకి వాహనాలు దూసుకెళ్లి ఇప్పటికే పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. గత కొన్నేళ్లుగా ఈ బ్రిడ్జి సమస్య ఉన్నా.. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నిత్యం విద్యార్థులు వెళ్లే ప్రధాన రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జికి మరమ్మతులు చేయాలని మండలవాసులు కోరారు.

డ్రోన్ ద్వారా నానో యూరియా పిచికారీ


నానో యూరియా పిచికారీపై వివరిస్తున్న జేడీఏ, పీడీ, శాస్త్రవేత్తలు

యల్లనూరు: డ్రోన్ ద్వారా నానో యూరియా పిచికారీ చేసుకుంటే చాలా ఉపయోగాలు ఉన్నాయని, వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమా మహేశ్వరమ్మ, ఆత్మ పీడీ పద్మలత సూచించారు. గురువారం మండలంలోని పెద్దమల్లేపల్లిలో డ్రోన్ ద్వారా 25 ఎకరాల్లో నానో యూరియా పిచికారీ చేసే విధానాన్ని రైతులకు క్షేత్రస్థాయిలో చూపించారు. అనంతరం నానో యూరియా ప్రయోగాలు, ఫలితాలు, వాడుకునే విధానంపై అవగాహన కల్పించారు. రైతులు పలు రకాల పంటలకు సోకే తెగుళ్ల గురించి జేడీఏను అడిగి సలహాలు తీసుకున్నారు. కార్యక్రమంలో తాడిపత్రి ఏడీఏ రవి, శాస్త్రవేత్తలు విజయశంకర్, బాబు, నారాయణస్వామి, భాస్కర్, ఏఓ నరసింహులు, యల్లనూరు, పుట్లూరు, పెద్ద పప్పూరు ఏఓలు కిరణ్‌కుమార్‌రెడ్డి, కాత్యాయిని, మోహితా కిరణ్, ఏఈఓ మధు, వీహెచ్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

కట్ట పనుల్లో నాణ్యత పాటించాలి


క్వాలిటీని పరిశీలిస్తున్న ఈఈ శివకుమార్, డీఈ వీరరాఘవులు

యల్లనూరు: నిట్టూరు చెరువు కట్ట పనుల్లో నాణ్యత పాటించాలని జీఎన్ఎస్ఎస్ ఈఈ శివ కుమార్ సూచించారు. చెరువు కట్ట నాణత్య ప్రమాణాలను క్వాలిటీ కంట్రోల్ జేఈ పరమేశ్వరరెడ్డితో కలసి ఆయన గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 0.3 టీఎంసీ కెపాసిటీ ఉన్న నిట్టూరు చెరువు పనులు 2026 డిశంబరు నాటికి పూర్తవుతాయన్నారు. అలాగే బుక్కాపురం, బొప్పేపల్లి చెరువులకు మరమ్మతులు చేస్తామన్నారు. నిట్టూరు, బొప్పేపల్లి, బుక్కాపురం చెరువులకు సంబంధించి రూ.118 కోట్ల వ్యయంతో పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో డీఈ వీర రాఘవులు, జేఈ ప్రశాంత్ కుమార్, కాంట్రాక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే లక్ష్యం


యాడికి ఎంపీడీఓ సమావేశ భవనంలో కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

యాడికి: మహిళలంతా ఆరోగ్యంగా జీవించాలన్నదే స్వస్థ్ నారీ స శక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమ లక్ష్యమని యాడికి పీహెచ్‌సీ వైద్యాధికారులు పరమేశ్వర, సుమంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించి యాడికి మేజర్ పంచాయతీలోని మహిళా పారిశుధ్య కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

పామిడి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. పామిడిలో గురువారం ఎంపీడీఓ కే తేజోత్స్న ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చీపుర్లు పట్టి రోడ్లు ఊడ్చారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

● జగన్‌ను కలసిన మండల కన్వీనర్లు




మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మాజీ మంత్రి సాకే శైలజానాథ్, యల్లనూరు, పుట్లూరు, గార్లదిన్నె మండల కన్వీనర్లు శివశంకర్, మహేశ్వర్‌రెడ్డి, ఎల్లారెడ్డి

శింగనమల: మాజీ ముఖ్యమంత్రి , వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ , యల్లనూరు, పుట్లూరు, గార్లదిన్నె మండల కన్వీనర్లు శివశంకర్, మహేశ్వరెడ్డి, ఎల్లారెడ్డి గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని జగన్ సూచించారు. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకోవాలన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సర్వసాధారణం


ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

గుత్తి: క్రీడల్లో గెలుపు, ఓటములు సర్వసాధారణమని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించిన వారే అసలైన విజేతలని రైల్వే డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ రమేష్, మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, ఎస్ఐ సురేష్ అన్నారు. గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ క్రీడామైదానంలో గురువారం గౌతమిపురి ఫుట్‌బాల్ అసోసియేషన్, ఆర్డీటీ, రైల్వే ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా సూరి అండ్ ప్రేమ్ ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అకాల మరణం చెందిన ఫుట్ బాల్ ఆటగాళ్లు సూరి, ప్రేమ్ పేరు మీద వారి స్నేహితులు భారీ ఫుట్ బాల్ టోర్నీ నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రారంభ మ్యాచ్‌లో గుత్తి సీనియర్ ఫుట్‌బాల్ జట్టు– గుత్తి ఆర్ఎస్ ఫుట్‌బాల్ జట్లు తలపడ్డాయి. మొత్తం 24 జట్లు రెండు గ్రూప్‌లుగా మూడు రోజులపాటు టోర్నీలో తలపడతాయని నిర్వాహకులు నవీన్, చాంద్ , డాడీ తెలిపారు. కార్యక్రమంలో వ్యాఖ్యాత నవీన్, నిర్వాహకులు రాజా, రమేష్, చాంద్ బాషా, డ్యాడీ, ప్రసాద్, గిరిబాబు, హరినాథ్‌రెడ్డి, చిన్న, బాషా, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు..


గేట్స్‌లో మాట్లాడుతున్న ఎండీ రఘునాథ్ రెడ్డి

గుత్తి: క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని గేట్స్ ఎండీ రఘునాథ్ రెడ్డి, కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ సూచించారు. గేట్స్ కాలేజీలో గురువారం ఫ్రెషర్స్ డే, ఓరియంటేషన్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చదువుతో పాటు శారీరక, మానసిక సామర్థ్యాలు పెంచుకోవాలన్నారు. ఇంటర్వ్యూల నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్ వీకే వాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా, హెచ్ఓడీ హరిప్రియ, అధ్యాపకులు పాల్గొన్నారు.

‘దీన్ దయాళ్’ ఆశయాలను కొనసాగిస్తాం

గుంతకల్లుటౌన్: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలను కొనసాగిస్తామని బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్ అన్నారు. గురువారం ఇల్లూరు భవన్‌లో దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, నాయకులు శేకన్న, సూర్యనారాయణ, కొలిమి రామాంజి, విశ్వనాథ్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జగజ్జననీ.. పాహిమాం


గుంతకల్లులో రాజరాజేశ్వరీ దేవిగా వాసవీమాత


గుంతకల్లులో లలితా త్రిపుర సుందరిగా మారెమ్మదేవి


గుంతకల్లులో కాత్యాయనిదేవిగా కొల్హాపురి మహాలక్ష్మి


తాడిపత్రిలో కాత్యాయనీ అలంకరణలో అమ్మవారు



బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కుష్మాండదేవిగా..


తాడిపత్రిలోని వడ్డెపాలెంలో మీనాక్షి అలంకరణలో కాళికాదేవి


సేవాఘడ్‌లో కాత్యాయనిదేవిగా మాతా జగదాంబ

గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు నాలుగో రోజు గురువారం వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. హాజరైన భక్తులకు అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్


పామిడిలో కాత్యాయని దేవిగా వాసవీమాత


చాగల్లులో దుర్గాదేవిగా చౌడేశ్వరిదేవి


యాడికిలో వారాహి అలంకారంలో పెద్దమ్మ తల్లి


పెద్దవడుగూరులో లలితాదేవి అలంకరణలో..


నార్పల ఉద్దిబావి చేను కాలనీలో దుర్గాదేవి


పూజలందుకుంటున్న శింగనమల దుర్గాదేవి


బీకేఎస్‌లో కాత్యాయనీదేవిగా ముసలమ్మ తల్లి


గుత్తిలో అన్నపూర్ణదేవిగా వాసవీమాత

రేపు ‘రీ కాలింగ్’ కార్యక్రమం

బుక్కరాయసముద్రం: మండలంలోని కేకే అగ్రహారం, సంజీవపురం, బొమ్మలాటపల్లి, చెన్నంపల్లిలో శనివారం సాయంత్రం శింగనమల నియోజకవర్గ సమన్వయ కర్త శైలజానాథ్ ఆదేశాల మేరకు రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి గురువారం తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

నేడు ఆర్టీసీ ఎండీ రాక

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణానికి శుక్రవారం ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు రానున్నట్లు డిపో మేనేజర్ మురళీధర్ గురువారం తెలిపారు. తాడిపత్రి ఆర్టీసీ బస్టాండ్‌ను ఆయన పరిశీలించనున్నారు. అయితే ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరుకోవడంతో ఆయనకు సమస్యలు స్వాగతం పలకనున్నాయి. అలాగే దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను పరిష్కరించాలంటూ ఆయన వినతిపత్రాలిచ్చేందుకు కార్మిక సంఘాల నాయకులు సిద్ధమయ్యారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల సీజ్

పెద్దవడుగూరు: మండలంలోని కొండూరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను గురువారం ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా పెన్నానది నుంచి ఇసుకను తరలిస్తున్నట్లుగా సమాచారం రావడంతో ట్రాక్టర్లను సీజ్ చేశామని పోలీసులు తెలిపారు. ట్రాక్టర్ యజమానులను తహసీల్దార్ ఉషారాణి ముందు హాజరు పరుచగా.. ట్రాక్టర్‌కు రూ.5 వేల చొప్పున జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే ఎంతటివారైనా సరే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

వేంకటేశ్వరస్వామికి అన్నకూటోత్సవం


శ్రీవారికి 108 ఆహార పదార్థాలతో కూడిన మహా నైవేద్యాన్ని సమర్పిస్తున్న అర్చకులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రాజేంద్రనగర్‌లో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం మహా అన్నకూటోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దసరా ఉత్సవాల సందర్భంగా శ్రీవారికి 108 రకాల ఆహార పదార్థాలను నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్ రంగయ్య, ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రసాద కమిటీ చైర్మన్ జయంతి వెంకట్, సభ్యులు ప్రవీణ్, సుదర్శన్, వేల్పూరి రవి, భక్తాదులు పాల్గొన్నారు.

‘ఎల్ఆర్ఎస్’తో ప్లాట్ల రెగ్యులరైజ్


మాట్లాడుతున్న డీడీ సంజీవ కుమార్

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో అనధికారిక లే అవుట్లలో ప్లాట్లు కొన్నవారు ఎల్ఆర్ఎస్ స్కీం ద్వారా ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవచ్చని రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ సంజీవ కుమార్, జిల్లా టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సువర్ణ సూచించారు. గుత్తి మున్సిపల్ కార్యాలయంలో గురువారం వారు మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియాతో కలిసి మాట్లాడారు. రెగ్యులరైజ్ చేసుకుంటే ఇంటి నిర్మాణ అనుమతి పొందే సమయంలో 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జెస్‌లో 50 శాతం రాయితీ పొందవచ్చన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోక్సో కేసులో యువకుడికి రిమాండ్

గుంతకల్లు టౌన్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గుంతకల్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు. పట్టణంలోని ఓ కాలనీకి చెందిన మైనర్ బాలికను అదే వీధికి చెందిన ఓ యువకుడు మాయ మాటలతో లోబర్చుకుని ఈ నెల 15న లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం ముఖం చాటేశాడు. జరిగిన మోసాన్ని గ్రహించిన ఆ బాలిక రెండు రోజుల క్రితం తన తల్లికి వివరించి బోరున విలపించింది. దీంతో బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.